సాక్షి నిజామాబాద్

శుక్రవారం : 5 : ఏప్రిల్ : 2024



లెక్క చెప్పాల్సిందే..

ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు నిఘా పెంచారు. మద్యం దుకాణాల్లో విక్రయాల లెక్కలపై ఆరా తీస్తున్నారు.

- 8లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
41.4 /27.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

195 మంది టీచర్లకు నోటీసులు

నిజామాబాద్ అర్బన్: ఉమ్మడి జిల్లాలో పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌కు గైర్హాజరైన 195 మంది టీచర్లకు డీఈవో దుర్గాప్రసాద్ గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 8గంటలలోపు హాజరు కావాలని సూచించారు. లేదంటే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లాలో 58 మంది, కామరెడ్డి జిల్లాలో 137 మంది టీచర్లు మూల్యాంకన విధులకు హాజరు కాలేదని ఆయన తెలిపారు.

స్పెషల్ అసిస్టెంట్లు రిపోర్ట్ చేయాలి

పదో తరగతి మూల్యాంకనం కోసం నియమించిన స్పెషల్ అసిస్టెంట్లు మూల్యాంకన కేంద్రంలో శుక్రవారం రిపోర్టు చేయాలని డీఈవో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేదంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ముగ్గురు విద్యాశాఖ ఉద్యోగులకు..

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగులకు డీఈవో దుర్గాప్రసాద్ నోటీసులు జారీ చేశారు. కార్యాలయానికి సంబంధించిన ఉత్తర్వు కాపీలు బయటకు వెళ్లడంతో ఆయన స్పందించారు. సదరు కాపీ బయటకు వచ్చిన విషయం విద్యాశాఖ కమిషనర్ దృష్టికి వెళ్లింది. దీంతో సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించడంతో ఉద్యోగులు సజ్జన్, మహేశ్, మురళిలకు డీఈవో నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో మహేశ్‌ను భీమ్‌గల్‌కు బదిలీ చేశారు. ఆయనపై డీఈవో పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు.

ధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దు



సుభాష్‌నగర్: రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 856 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఏప్రిల్ 1న అన్నిచోట్ల అధికారులే కేంద్రాలను ప్రారంభించారని పేర్కొన్నారు. సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకు రావాలని సూచించారు. కడ్తా పేరుతో తరుగు తీసినట్లు తమ దృష్టికి వస్తే అలాంటి రైస్‌మిల్లులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గోర్కంటి లింగం పాల్గొన్నారు.

26న ఎగ్జిబిషన్ ప్రారంభం



నిజామాబాద్ సిటీ: నగరంలో అఖిల భారత వ్యవసాయ, పారిశ్రామిక ప్రదర్శన(ఎగ్జిబిషన్)ను ఈ నెల 26న ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు సొసైటీ ఉపాధ్యక్షుడు దాసరి నర్సింలు తెలిపారు. గురువారం కంఠేశ్వర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. 41 రోజుల పాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, వివిధ రాష్ట్రాలకు చెందిన 300 స్టాల్స్ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. సొసైటీ సభ్యులు గంగారెడ్డి, రామచంద్రరెడ్డి, రమేశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వినోద్ కుమార్, దిగంబర్, భక్తవత్సలం నాయుడు, సాంబయ్య, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

ఎల్లారెడ్డిరూరల్: నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీ రాజ్‌దాస్‌పై ఎంపీటీసీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానానికి సభ్యులు నోటీసు ఇవ్వగా గురువారం ఆర్డీవో ప్రభాకర్ ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అవిశ్వాస తీర్మానానికి ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు మద్దతు తెలపడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు.

మండుటెండలో ప్రచార పర్వం

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. మండుటెండల్లో సైతం అభ్యర్థులు నియోజకవర్గంలో పర్యటిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి యత్నిస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి ప్రచారంలో దూసుకుపోతుండగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ ఏడు పదుల వయసులోనూ ఎండలను లెక్క చేయకుండా ప్రచారం చేస్తున్నారు.

- ఏడు పదుల వయసులో పట్టుదలతో ప్రచారం
- నిజామాబాద్ బరిలో నువ్వా.. నేనా అనేలా పోటీ
- సిట్టింగ్ ఎంపీ అర్వింద్ దూకుడు.. తగ్గేదే లేదంటున్న జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల ఘట్టానికి సంబంధించి నిజామాబాద్ స్థానానికి మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కాగా, పోలింగ్‌కు కౌంట్‌డౌన్ నడుస్తోంది. దీంతో ఎన్నికల వేడి మరింతగా పెరుగుతోంది. రాష్ట్రంలో ప్రస్తుత ఎన్నికల్లో అనూహ్యంగా బీజేపీ ప్రధాన పోటీదారుగా మారడంతో త్రిముఖ పోటీ నెలకొంది. ఉత్తర తెలంగాణలో కీలకమైన, విలక్షణ తీర్పును ఇచ్చే ఓటర్లున్న నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో పోరు రసవత్తరంగా మారింది. ఇక్కడ బీజేపీ నుంచి సిట్టింగ్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఉత్సాహంతో దూకుడుగా ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే అర్వింద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక విడత ప్రచారం పూర్తి చేశారు. అర్వింద్‌కు దీటుగా ప్రచారం చేసే లక్ష్యంతో కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి సైతం ప్రచారాన్ని బిజీ షెడ్యూల్‌తో కొనసాగిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్ని సెగ్మెంట్లలో తిరుగుతున్నారు. జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌లు నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో తమదైన ముద్ర వేసుకున్నారు. ఫైర్ బ్రాండ్‌గా పేరున్న ధర్మపురి అర్వింద్‌ను ఢీకొట్టే విషయంలో మాస్ లీడర్లుగా పేరుపొందిన జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి తగ్గేదే లేదంటూ మండుటెండను లెక్కచేయకుండా తిరుగుతున్నారు. ఏడు పదుల వయసులో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నప్పటికీ గట్టిగానే ప్రచారంలో ముందుకెళుతున్నారు.

■ అసెంబ్లీ నియోజకవర్గంతో పోలిస్తే పార్లమెంట్ నియోజకవర్గం ఏడు రెట్లు ఎక్కువగా విస్తీర్ణం ఉండగా, ఎక్కువ మంది ఓటర్లను పార్టీల అభ్యర్థులు కలవాల్సిన పరిస్థితి ఉంది. పోలింగ్‌కు ఇంకా 37 రోజులు ఉంది. దీంతో సమయాన్ని వృథా కానివ్వకుండా షెడ్యూల్ రూపొందించుకుంటూ అభ్యర్థులు ముందుకు వెళుతున్నారు. ఈసారి వేసవిలో ముందుగానే ఉష్ణోగ్రతలు పెరిగాయి. రోజురోజుకూ అత్యధిక మవుతున్నాయి. మండుటెండలను లెక్కచేయకుండా, శరీరం సహకరించకున్నప్పటికీ అభ్యర్థులైన ఇద్దరు పెద్దమనుషులు ఎన్నికల బరిలో పోటాపోటీగా తిరుగుతున్నారు. మార్నింగ్ వాకర్స్‌తో మొదలుకుని, రాత్రి అయ్యేవరకు సుడిగాలి పర్యటనలతో చెమటోడుస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. కాగా జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి ఇప్పటివరకు పార్లమెంట్‌లో అడుగుపెట్టలేదు.

అభ్యర్థుల వెంట సీనియర్ నాయకులు..

ప్రచారంలో అర్వింద్, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డిలతో పాటు తిరుగుతున్న వారిలో ఆయా పార్టీల సీనియర్ నాయకులు ఎక్కువగానే ఉన్నారు. వీరందరూ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలతో సమానంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. పోటీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీల శ్రేణుల్లోని సీనియర్లు చాలామంది యాభై,అరవై, డెబ్బై ఏళ్ల వయస్సు పైబడిన వారున్నారు. వీరంతా తీవ్రమైన ఎండ వేడిమిని లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. మొత్తానికి ఈ ఎన్నికల వేడికి తోడు ఎండలు పెరుగుతున్నప్పటికీ వయస్సుతో నిమిత్తం లేకుండా నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో ఉరకలెత్తుతుండడం విశేషం.

తాగునీటికి ఇబ్బందులు రావొద్దు



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ శరత్, పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

- క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలి
- అధికారులతో సమీక్షలో జిల్లా ప్రత్యేకాధికారి శరత్

సుభాష్‌నగర్: తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి తాగునీటి సరఫరా తీరుతెన్నులపై మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ.. నీటి ఎద్దడి తలెత్తితే అనుమతుల కోసం వేచి చూడకుండా యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్ లైన్ల మరమ్మతులు సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని అన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే వ్యవసాయ బోరుబావులను అద్దెకు తీసుకోవాలని, ఎలాంటి ప్రత్యామ్నాయాలు లేనిపక్షంలో చివరి ప్రయత్నంగా ట్యాంకర్లను వినియోగించాలన్నారు. జిల్లాకు ప్రధానంగా శ్రీరాంసాగర్, సింగూరు నుంచి తాగునీటి లభ్యత ఉందని, పై రెండు జలాశయాల్లోనూ సరిపడా నీటి నిల్వలు ఉన్నందున ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండల ప్రత్యేకాధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో బృందాలను క్లస్టర్ అధికారులుగా నియమిస్తూ క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా తీరును నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. మంచినీటి వ్యవస్థను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ తాగునీటి సరఫరా పర్యవేక్షణకు జిల్లా అధికారులను మండల స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తామన్నారు. పట్టణాల్లో బల్దియాల కమిషనర్లు, గ్రామాల్లో పంచాయతీల కార్యదర్శులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేసవి దృష్ట్యా మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సెలవులు రద్దు చేస్తున్నామని, ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున ఇప్పటికే ఎంపీడీవోలు, తహసీల్దార్లకు సెలవులు రద్దు చేశామని కలెక్టర్ గుర్తుచేశారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

సదరం క్యాంపులు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఏప్రిల్‌కు సంబంధించిన సదరం క్యాంపులు ఖరారైనట్లు డీఆర్‌డీవో సాయాగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 24 తేదీల్లో ఈ శిబిరాలను నిర్వహిస్తామన్నారు. క్యాంపులకు హాజరయ్యేందుకు దివ్యాంగులు ఈ నెల 6న ఉదయం 11 గంటలకు మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. మొత్తం 260 స్లాట్లను విడుదల చేస్తామని, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేటాయించిన తేదీల్లో స్లాటు రసీదుతో పాటు సంబంధిత సర్టిఫికెట్లు వెంట తెచ్చుకుని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రావాలని సూచించారు.

ప్రైవేటుకే విక్రయం



మోర్తాడ్‌లో ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

- వ్యాపారులకు ధాన్యం అమ్మడానికి రైతుల ఆసక్తి

మోర్తాడ్: యాసంగి సీజన్‌లో పండిన ధాన్యం కొనుగోలు కోసం కేంద్రాలను ప్రారంభిస్తున్నా రైతులు మాత్రం వ్యాపారులకే విక్రయించానికి మొగ్గు చూపుతున్నారు. రైస్ మిల్లర్లు, వ్యాపారులు గ్రామాల్లోకి వచ్చి ఒప్పందం చేసుకోవడంతో పాటు వారం, 15 రోజుల గడువులోగా డబ్బులు చెల్లించడానికి అంగీకరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ శాతం నిర్ణీత మొత్తంలోనే ఉండాలి. క్వింటాలుకు 3 కిలోల నుంచి 5 కిలోల వరకు తరుగు తీసే అవకాశం ఉంది. హమాలీ చార్జీలను రైతులే భరించాల్సి వస్తుంది. ఈ మూడు రకాలుగా ఇబ్బందులు పడేకంటే వ్యాపారులకే వడ్లు విక్రయిస్తే తమకు ఎలాంటి సమస్య ఉండదని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికే మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, బాల్కొండ, వేల్పూర్, ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్ మండలాల నుంచి దాదాపు వంద లారీల ధాన్యం వ్యాపారులు కొనుగోలు చేసి తరలించారు. యాసంగిలో సన్న రకం ఎక్కువ సాగు చేయగా వీటికి రూ.2,200 నుంచి రూ.2,300 ధరను వ్యాపారులు చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న రకాలకు బీ గ్రేడ్ ధరనే వర్తిస్తుంది. దొడ్డు రకాలకే ఏ గ్రేడ్ ధర అమలు చేయడం, నిబంధనలు కఠినంగా ఉండటంతో రైతులు మిల్లర్లు, వ్యాపారులకే విక్రయించడానికి ఆసక్తిని చూపుతున్నారు. కాగా ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లాలో 466 కొనుగోలు కేంద్రాలను ఆరంభించాలని నిర్ణయించారు. ఇప్పటికే 250 వరకు కేంద్రాలను ప్రారంభించారు.

కాలం చెల్లిన ఇంజెక్షన్‌తో బాలుడి మృతి!

- వైద్యుడిపై ఫిర్యాదు చేసిన బాధితులు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

నిజామాబాద్ నాగారం: కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇవ్వడంతో బాలుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ధర్పల్లి మండలానికి చెందిన దీక్షిత్ అనే 10 నెలల బాలుడు గత నెలలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ఖలీల్‌వాడిలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఐదు రోజుల వైద్యం తర్వాత బాలుడి ఆరోగ్యం మెరుగైంది. డిశ్చార్జి చేసే సమయంలో ఓ ఇంజెక్షన్ ఇచ్చారు. తర్వాత దీక్షిత్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో మెరుగైన వైద్యం కోసం సదరు వైద్యుడి సూచన మేరకు హైదరాబాద్ తరలించారు. మార్గమధ్యలో బాలుడు మృతి చెందాడు. తీరా కుటుంబీకులకు అనుమానం వచ్చి ఇంజెక్షన్ గురించి ఆరా తీయగా ఈ ఏడాది ఫిబ్రవరిలోనే దాని గడువు ముగిసినట్లు గుర్తించారు. కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇచ్చి బాలుడి మృతికి కారణమైన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు గురువారం కలెక్టర్, ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పర్యవేక్షణ అంతంతే..

ఆస్పత్రుల్లో ఎలాంటి మందులు ఉపయోగిస్తున్నారో డ్రగ్స్ అండ్ కంట్రోల్ అధికారులు కనీసం పర్యవేక్షించడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో వైద్యం వికటించి మరణాలు చోటు చేసుకుంటున్నాయి. కాలం చెల్లిన మందుల విషయంలో పర్యవేక్షణ చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ ఘటనపై ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబును వివరణ కోరగా బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. వైద్య శాఖ విచారణ తర్వాత చర్యలు ఉంటాయన్నారు.

అధికారికి రాజకీయ అండ

- పశువైద్య అధికారిని కాపాడుతున్న రాజకీయ నేతలు
- విచారణ నివేదికను మార్చేందుకు ప్రయత్నాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): తప్పు చేసి దొరికిపోయిన మండల పశువైద్య అధికారి హన్మంత్‌రెడ్డిని కాపాడేందుకు పలుకుబడిన కొందరు రాజకీయ నాయకులు రంగంలోకి దిగారు. అధికారిపై ఎలాంటి చర్యలు లేకుండా విచారణ నివేదికను మార్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఉన్నతాధికారులకు ఫోన్లు చేసి తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు విశ్వసనీయం సమాచారం. ఈ వ్యవహారాన్ని చక్కదిద్ది అధికారిని తప్పించడానికి మండలానికి చెందిన ఒక పేరున్న రాజకీయ నేతతో పాటు నియోజకవర్గ స్థాయిలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు యత్నిస్తున్నట్లు తెలిసింది. పశువైద్య అధికారిగా ఉన్న హన్మంత్ రెడ్డి డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామ పంచాయతీకి స్పెషల్ ఆఫీ సర్‌గా కొనసాగుతూ ఇటీవల జీపీ ట్రాక్టర్‌లో తన ఇంటికి అక్రమంగా ఇసుకను తరలించి పట్టుబడిన విషయం తెలిసిందే. దీనిపై ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణను విచారణ అధికారిగా నియమించగా, ఈ నెల 3న విచారించారు. ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు కారోబార్, పంచాయతీ కార్యదర్శిని బెదిరించే ప్రయత్నం చేసినప్పటికీ వారు విచారణలో నిజాలను వెల్లడించారు. విచారణ తనకు అనుకూలంగా లేకపోయేసరికి స్పెషల్ ఆఫీసర్ బడా రాజకీయ నాయకులను ఆశ్రయించి పైరవీలకు తెరలేపారు. రెండు రోజులుగా సదరు నేతలతోనే గడుపుతూ తనను ఎలాగైనా ఇందులోంచి బయటకు తీసుకురావాలని వేడుకున్నట్లు తెలిసింది. ఒకవేళ విచారణ నివేదిక తారుమారైతే గ్రామస్తులతో పాటు వాంగ్మూలం ఇచ్చిన జీపీ సిబ్బంది కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయడానికి సిద్ధం అవుతున్నారు.



అధికారిపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ఉద్యోగుల అసహనం

మండల పశువైద్య అధికారిగా పనిచేస్తున్న హన్మంత్‌రెడ్డి తీరుపై ఆ శాఖలో జోరుగా చర్చ నడుస్తోంది. గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిగా ఉండి నిబంధనలకు విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్ప డడంపై ఆ శాఖలోని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క అధికారి ప్రవర్తన తీరు శాఖ మొత్తానికి మచ్చను తెచ్చిపెట్టిందని వాపోతున్నా రు. జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగ సంఘానికి ప్రధాన కార్యదర్శి హోదాలో పని చేస్తున్న హన్మంత్‌రెడ్డి రాష్ట్ర పశువైద్య అధికారుల సంఘానికి కూడా అసోసియేట్ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. పదవులను అడ్డం పెట్టుకుని శాఖలోనే కాకుండా గ్రామ పంచాయతీల్లో ఇష్టారాజ్యంగా నడుచుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. హన్మంత్‌రెడ్డి ప్రవర్తనతో నొచ్చుకున్న ఉద్యోగులు, సిబ్బంది ఒక్కొక్కరుగా బయటకు వచ్చి నిజాలను 'సాక్షి'తో పంచుకుంటున్నారు.

సకాలంలో డబ్బులు జమ చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

డొంకేశ్వర్(ఆర్మూర్): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు సకాలంలో జమయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం అమ్మిన రైతుల వివరాలను వెంటనే ట్యాబ్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని వసతులు కల్పించాలని, ఐకేపీ అధికారులు కేంద్రాలను పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయి డీఎం జగదీశ్వర్, డీపీఎం సాయిలు, ఏపీఎం గంగాధర్, కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

రహదారి.. పచ్చని పందిరి

కామారెడ్డి జిల్లా గాంధారి ఎక్స్ రోడ్డు నుంచి గాంధారికి వెళ్లే మార్గంలో పచ్చదనంతో కూడిన చెట్లు వాహన చోదకులు, ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. గాంధారి ఎక్స్ రోడ్డు ప్రాంతంలో ఉన్న చెట్లు రోడ్డుకు ఇరువైపులా కళకళలాడుతున్నాయి. ఈ రోడ్డు మీదుగా వెళ్లే వాహనదారులు ఎండ వేడిని తట్టుకునేందుకు కొంతసేపు ఈ చెట్ల కింద సేదతీరుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



క్లుప్తంగా

ఆదిత్య ఫౌండేషన్ సందర్శన



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని నాగల్గావ్ గ్రామంలో ఉన్న ఆదిత్య ఫౌండేషన్‌ను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నాబార్డ్ డీడీఎం సందీప్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ దిలీప్ పాటిల్‌తో 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న రైతు సేవా కార్యక్రమాలపై చర్చించారు. గత మూడేళ్లుగా ఫౌండేషన్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయన వెంట ఫౌండేషన్ సిబ్బంది శ్రీధర్, మీర్‌దొడ్డి విఠల్ తదితరులు ఉన్నారు.

సౌత్ క్యాంపస్ విద్యార్థుల క్షేత్ర పర్యటన



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సోషల్ వర్క్ విద్యార్థులు తమ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం హన్మాస్‌పల్లిలో గురువారం పర్యటించారు. అక్కడి ప్రజల జీవన స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, విద్య, వైద్యం, వ్యవసాయం గురించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోషల్‌వర్క్ హెచ్‌వోడీ డాక్టర్ రాజేశ్వరి, ఆచార్యులు యాలాద్రి, క్టర్ రమాదేవి, సీజేఆర్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠాపనోత్సవాలు



కామారెడ్డి అర్బన్: పట్టణ కేంద్రంలోని శ్రీసీతా రామ ప్రసన్నాంజనేయ సహిత లలితా త్రిపుర సుందరి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ముగిశాయి. సోమవారం ప్రారంభమైన ఉత్సవాలు గురువారం హోమం, శాంతి పౌష్టిక హవణం, గర్త సంస్కారం, బలిప్రదానం, యంత్ర, ధ్వజస్తంభ పతిష్ఠాపన, 108 కలశాల అభిషేకంతో ముగిశాయి. ఆలయంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గడ్డం ఇందుప్రియ పూజలు చేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు మాసుల లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకుడు ఎ రమేశ్ గుప్తా, డీవీఎస్ శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మినీ ఎత్తిపోతలకు మహర్దశ

- చిక్లి చెక్‌డ్యామ్‌కు అలీసాగర్ నీరు
- యాసంగి పంటలకు నీటి విడుదల
- ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, పశుకాపరులు

పూలాంగ్ వాగు నీటిని ఆధారం చేసుకొని చిక్లి క్యాంప్ వద్ద నిర్మించిన మినీ ఎత్తిపోతల(చెక్‌డ్యామ్)కు మంచి రోజులొచ్చాయి. నీటి ప్రవాహం లేక, గత ప్రభుత్వం పట్టించుకోక నిరాదరణకు గురైన మినీ ఎత్తిపోతల పథకం ప్రస్తుతం నీటితో కళకళలాడుతున్నది. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని అలీసాగర్ ఎత్తిపోతల నీటిని పూలాంగ్ వాగుకు మళ్లింపజేయడమే దీనికి కారణం.



చిక్లి చెక్ డ్యాములోకి చేరుతున్న నీరు

మాక్లూర్: నవీపేట మండలంలోని సిరన్‌పల్లి, శ్యాకాపూర్, లింగాపూర్ గ్రామాల పరిధిలో సుమారు 2వేల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చిక్లి క్యాంప్ వద్ద మినీ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. పూలాంగ్ వాగు నీటిని ఆధారంగా చేసుకొని ముందుగా రూ.3కోట్ల 20లక్షల వ్యయంతో చెక్ డ్యామును నిర్మించి మరో రూ.4కోట్ల 73లక్షల అంచనా వ్యయంతో మినీ ఎత్తిపోతల పథకం(పంప్ హౌజ్) పనులు చేపట్టారు. అప్పట్లో రాష్ట్ర భారీ, మధ్యతరహా నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో పనులను పూర్తి చేయించారు. అయితే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ పథకం ఆదరణకు నోచుకోలేదు. ఫలితంగా ప్రతి యాసంగి సీజన్‌లో పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోయి రైతులు నష్టపోయారు. సుదర్శన్‌రెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలవడంతో ఈ ఎత్తిపోతల పథకానికి మహర్దశ వచ్చింది. నవీపేట మండలంలోని అలీసాగర్ ఎత్తిపోతల నీటిని నిజామాబాద్ రూరల్ మండలం కాలూర్ శివారులోని పూలాంగ్ వాగుకు చేరేలా ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అలా పూలాంగ్ వాగులోకి చేరిన నీరు మాక్లూర్ మండలంలోని ముల్లంగి (బి), బొంకన్‌పల్లి, గొట్టుముక్కల, మెట్‌పల్లి, వల్లభాపూర్, చిక్లి, గుంజ్లి, నిజామాబాద్ రూరల్, నవీపేట మండలాల్లోని పొల్దా, నాడాపూర్, జన్నేపల్లి, సిరన్‌పల్లి సరిహద్దుల నుంచి ప్రవహిస్తోంది. వాగులో ఉన్న పెద్దపెద్ద గుంతలతోపాటు కృష్ణానగర్, బొంకన్‌పల్లి, వల్లభాపూర్ వద్ద ఉన్న చెక్ డ్యాములు అలీసాగర్ నీటితో నిండాయి. ఆ తరువాత అలీసాగర్ ఎత్తిపోతల నీరు చిక్లి చెక్‌డ్యాముకు చేరగా ఆయకట్టుకు నిరాటంకంగా నీరందించారు. మూడు నెలలపాటు నిరాటంకంగా ఎత్తిపోతల పథకం పని చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వేసవిలో సైతం 15కిలోమీటర్ల మేర వాగు ప్రవహించడంతో చిక్లి మినీఎత్తిపోతల పథకం ద్వారా యాసంగి పంటలకు ప్రతి రోజూ నీరందించారు. ఈ సీజన్‌లో ఒక్క గుంట కూడా ఎండకపోవడంతో రైతులు సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



చిక్లి క్యాంప్ పంప్‌హౌజ్

పదేళ్లలో ఇలా నీరు రాలేదు



పదేళ్లలో ఎండాకాలంలో ఎన్నడూ నీరు రాలేదు. చలి కాలంలోనే నీటిధారలు బంద్ అయ్యేవి. ఎప్పుడైనా ఓసారి మురికినీరు వచ్చేది. ఆ నీటిని పశువులు కూడా తాగేవి కాదు. ఈసారి మాత్రం వాగు ఎండిపోలేదు. మంచి నీరు ఇంకా ప్రవహిస్తూనే ఉంది. వాగును ఆధారంగా చేసుకుని ఏర్పాటు చేసిన మోటార్లకు ఇంకా నీరందుతోంది. – కురుమ బీరయ్య, రైతు, వల్లభాపూర్

నిరంతరాయంగా లిఫ్ట్ నడిపించాం



గతంలో ఎన్నడూ లేని విధంగా లిఫ్ట్‌ను 3 నెలలపాటు ప్రతిరోజూ నడిపించాం. సిరన్‌పల్లి, శ్యాకాపూర్, లింగాపూర్ వరకు పంటలకు లిఫ్ట్ నుంచి పంప్ చేసిన నీరు వెళ్లింది. నీరు నిరంతరాయంగా వస్తుండడంతో పంటలకు పుష్కలంగా విడుదల చేశాం. రైతులు సంతోషంగా ఉన్నారు. – షరీఫ్, లిఫ్ట్ ఆపరేటర్, చిక్లి క్యాంప్

లెక్క చెప్పాల్సిందే..

- ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారుల ఆరా
- రోజువారి వివరాలు సేకరిస్తున్న అధికారులు

మోర్తాడ్(బాల్కొండ): పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ నిఘా పెంచింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే గ్రామాల్లోని బెల్ట్ షాపులను మూయించిన అధికారులు వైన్ షాపులలో రోజువారి మద్యం విక్రయాల లెక్కలను తీస్తున్నారు. మద్యం విక్రయాలపై ఎలాంటి నియంత్రణ లేకపోయినప్పటికీ.. వైన్స్‌ల వారీగా రోజువారి వివరాలు సేకరించి ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తున్నారు. గతనెల 16న ప్రారంభమైన లెక్కల సేకరణ ప్రక్రియ ఎలక్షన్ కోడ్ తొలగే వరకు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. జిల్లాలో 102 వైన్‌షాపులు ఉండగా నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్‌లో బార్‌లు ఉన్నాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు మద్యాన్ని పంపిణీ చేసే అవకాశం ఉండడంతో విక్రయాలపై నియంత్రణ ఉండాలని అధికారులు నిర్దేశించారు. మోర్తాడ్, భీమ్‌గల్, ఆర్మూర్, నిజామాబాద్, బోధన్‌లో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాలున్నాయి. ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత మద్యం విక్రయాలపై రేషన్ విధానం అమలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఎన్నికల ప్రక్రియ మొదలైన నుంచి మద్యం విక్రయాలపై నిఘా ఉంచడం, బెల్టుషాప్‌లను మూయించడం మంచి పరిణామమే అని చెప్పొచ్చు.

ప్రతి వైన్‌షాపు నుంచి లెక్కలు సేకరిస్తున్నాం

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నుంచి మద్యం విక్రయాలకు సంబంధించి లెక్కలను సేకరించి ఎలక్షన్ కమిషన్‌కు నివేదిస్తున్నాం. ఒకవేళ రోజువారీ మద్యం విక్రయాలు పెరిగితే అందుకు గల కారణాలను తెలుసుకుంటున్నాం. వినియోగదారులు కొనుగోలు చేస్తే ఎలాంటి ఇబ్బంది లేదు. రాజకీయ పార్టీల నాయకులు మద్యం ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తే సీజ్ చేస్తాం. – గుండప్ప, ఎక్సైజ్ సీఐ, మోర్తాడ్

భగవంతుని కృపతో మనిషి గొప్పగా ఎదుగుతాడు



ఇందూరు తిరుమలలో స్వామివారికి చక్రస్నానం



ఉత్తరతిరుపతి క్షేత్రంలో హారతి తీసుకుంటున్న ఎంపీ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): భగవంతుడు లోక కార్యాన్ని మనుషుల ద్వారా చేస్తారని, ఆయన కృపతోనే మనిషి గొప్పగా ఎదుగుతాడని దేవనాథ జీయర్‌స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాసు స్వామి ప్రవచించారు. మండలంలోని నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరో రోజైన గురువారం అంగరంగ వైభవంగా కొనసాగాయి.

మహా పూర్ణాహుతి అనంతరం స్వామి వారికి చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగం చేశారు. ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, శిరీశ్‌రెడ్డి, విజయసింహారెడ్డి, హరీశ్, సుదర్శన్‌రెడ్డి దంపతులు, ఎంపీటీసీ రాములు, ఫొటో గంగాధర్, రవీందర్‌యాదవ్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, రాజేశ్వర్, సాయిలు, గంగారెడ్డి, ప్రమోద్, సురేశ్, భూంరెడ్డి, యాజ్ఞాచార్యులు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్తర తిరుపతిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

నిజామాబాద్ సిటీ: ఉత్తర తిరుపతి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజైన గురువారం ఉదయం హోమం, స్వామి వారికి అభిషేకాలు, చక్రస్నానం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీ అర్వింద్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ సంపత్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మి కెనాల్‌కు నీటి విడుదల చేపట్టాలి

- బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి లక్ష్మి కాలువ ఆయకట్టుకు వెంటనే నీటి సరఫరాను చేపట్టాలని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్, ఎస్ఈలకు గురువారం ఫోను చేసి కోరారు. లక్ష్మి కాలువ ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంటలను కాపాడాలన్నారు. ప్రాజెక్ట్ నుంచి రోజుకు 400 క్యూసెక్కుల నీటిని వదిలి చివరి తడిగా 10 రోజుల్లో 0.3 టీఎంసీల నీటిని వదలాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతులు, స్థానిక ఎమ్మెల్యేగా తాను ప్రాజెక్ట్ అధికారులకు ఎంత విన్నవించినా వారు నీటి కేటాయింపులు చేపట్టలేదన్నారు. దాని ఫలితమే ప్రస్తుతం ఆయకట్టుకు చివరి తడి అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు అందక పంటలు ఎండిపోతే రైతులతో కలిసి ప్రభుత్వంపై పోరాటం చేస్తానని హెచ్చరించారు.

15 నుంచి ఎస్ఏ - 2 పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: ఈ నెల 15వ తేదీ నుంచి సమ్మెటీవ్ – 2 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయని, 23న పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి రిపోర్టులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, ఎనిదో తరగతి వారికి ఉదయం 9 నుంచి 11.45గంటల వరకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు ఉంటాయని వివరించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నిజాంసాగర్(జుక్కల్): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కోరారు. జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ పార్టీ మండలాల అధ్యక్షులను ఎమ్మెల్యే గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్ష పార్టీల ప్రలోభాలకు ప్రజలు లోను కాకుండా అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేదని శ్రీచైతన్య పాఠశాలకు తాళం

నిజామాబాద్ రూరల్: అద్దె చెల్లించడం లేదనే కారణంగా మండలంలోని గూపన్‌పల్లి ప్రాంతంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలకు భవనం యజమాని గురువారం ఉదయం తాళం వేశాడు. గేటుకు తాళం వేసి ఉండడంతో విద్యార్థులు అక్కడే కొద్దిసేపు వేచి ఉండి ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. త్వరలో పరీక్షలు ఉండగా, ఈ ఘటన చోటు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

ఆయిల్ చోరీల ముఠా సంచారం



కామారెడ్డి క్రైం: పంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్‌ను చోరీ చేసే ముఠా కామారెడ్డి ప్రాంతంలో సంచరిస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. రెండు రోజుల క్రితం టేక్రియాల్ వద్ద ఆయిల్ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం పరిశీలించారు. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో, పంట పొలాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దొంగతనాల నియంత్రణకు రైతులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

మెరుగైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి



కామారెడ్డి అర్బన్: మంచి ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకొని మెరుగైన సమాజ నిర్మాణానికి యువత కృషి చేయాలని ఒడిస్సా ఉత్కల్ విశ్వవిద్యాలయ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ సంగ్రామ్ కేసరి సమంతరాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సామాజిక మాధ్యమాలు–యువతపై ప్రభావం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి కేసరి సమంతరాయ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక మాధ్యమాలతో విద్యార్థులు స్పృహను కలిగి జీవన ప్రమాణాలను పెంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ కె విజయ్‌కుమార్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్లు, డాక్టర్ జి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, విలువలు, కర్తవ్యపాలనతో తమ జీవిత లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. జాతీయ సేవా పథకం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే ఎన్నో అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. సెమినార్‌లో వైస్ ప్రిన్సిపాల్ కె కిష్టయ్య, ఎ లక్ష్మణాచారి, డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అప్పులు, అనారోగ్యం కారణంగా ఆత్మహత్య

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి మండలం ఇసన్నపల్లికి చెందిన దొంతుల నరేశ్(53) అప్పులు, అనారోగ్యం కారణంగా బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు సంవత్సరాలుగా పక్షవాతంలో బాధపడుతున్న నరేశ్ పని చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. అప్పులు చేసి ముగ్గురు కూతుళ్ల వివాహం చేశాడు. ఓ వైపు అప్పులు, మరో వైపు అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెందిన నరేశ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండలం ఖాజాపూర్ గ్రామ శివారులోని వాగులో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు గురువారం సమాచారం అందిందని బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. మృతదేహం నీటిలో కుళ్లిపోయిందని, మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై నీలిరంగు జీన్స్ ప్యాంటు, నలుపు రంగు బెల్ట్ ఉందని ఆయన తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



నవీపేట : మండలంలోని సిరన్‌పల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు ఒయుదాభి(102) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఒయుదాభి గురువారం మృతి చెందారన్నారు.

బరంగెడ్గిలో అగ్ని ప్రమాదం

బాన్సువాడ : బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి చెందిన చాకలి నాగయ్య అనే వ్యక్తి ఇంట్లో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి నిప్పటించి ఉంటారని బాధితుడు అనుమానం వ్యక్తం చేశాడు. రూ. 50వేల నగదుతోపాటు ఫర్నిచర్, వస్తువులు, బీరువా దగ్ధమయ్యాయని, రూ.1.50లక్షల ఆస్తినష్టం జరిగిందని తెలిపాడు.

ఉపాధ్యాయుడి రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌శర్మను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. లింగంపేట మండలం శెట్పల్లి ఉన్నత పాఠశాలలో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో బాధితులు షీ టీమును ఆశ్రయించారు. పోలీసులు బుధవారం ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని విచారించి పోక్సో కేసు నమోదు చేశారు. గురువారం ఎల్లారెడ్డి కోర్టులో ఉపాధ్యాయుడిని హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని, అతడిని జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరికి రెండురోజుల జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మందికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చి మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా.. 13మందికి మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ రూ.15,700 జరిమానా, ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాంనగర్ కాలనీలో కొనసాగుతున్న వ్యభిచార గృహంపై ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడి చేశారు. స్థానికుల సమాచారం మేరకు దాడి చేసిన పోలీసులు వ్యభిచార గృహం నిర్వాహకుడితోపాటు ముగ్గురు మహిళలు, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. మహిళలను సఖీ సెంటర్‌కు, మిగతా వారిని స్టేషన్‌కు తరలించారు.

ఆస్తికోసం మామ దారుణ హత్య

- కూతురిని ప్రేమించి పెళ్లి చేసుకున్న అల్లుడే నిందితుడు
- సుపారీ గ్యాంగ్‌తో కలిసి ఘాతుకం



కాలువ ఒడ్డున చాకలి పోశయ్య మృతదేహం

నిజాంసాగర్ (జుక్కల్): ప్రేమ పెళ్లి చేసుకున్న అల్లుడు ఆస్తికోసం సుపారీ గ్యాంగ్‌తో కలిసి మామను హత్య చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన చాకలి పోచయ్య (50) తాపీ మేస్త్రిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పోచయ్య కుమార్తెను అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మామ ఆస్తి ఇతరుల పాలు కావద్దన్న ఉద్దేశంతో హత్య కోసం పథకం పన్నాడు. ఇందు కోసం గ్రామానికి చెందిన నడిమింటి రాములు, మహబూబ్‌లకు సుపారీ మాట్లాడుకొని వారి సహకారం తీసుకున్నాడు. ఒక్కొక్కరికి రూ.1.50 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి ముగ్గురు కలిసి పోచయ్య ఇంటికి వెళ్లారు. గాఢ నిద్రలో ఉన్న పోచయ్యను లేపి ఇంట్లోకి వెళ్లారు. ముగ్గురు పోచయ్యతో మాటలు కలిపి బండరాయితో తలపై కొట్టి చంపారు. అనంతరం పోచయ్య మృతదేహాన్ని మోపెడ్ వాహనం పై గాలిపూర్ సమీపంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువ వద్దకు తీసుకువెళ్లారు. కాలువ వద్ద వాహనాన్ని ఉంచి మృత దేహాన్ని కాలువలో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. గురువారం ఉదయం కాలువ వైపు ఉపాధి పనుల కోసం వెళ్లిన కూలీలు పోచయ్య మృత దేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనుమానంతో పోచయ్య అల్లుడు శ్రీకాంత్‌ను, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



మోహన్‌రెడ్డి (ఫైల్)

దోమకొండ: మండలంలోని అంచనూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇస్సానగర్‌కు చెందిన అంతం మోహన్‌రెడ్డి (52) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యవసాయం చేసే మోహన్ రెడ్డి ఇటీవల స్కూటీని కొనుగోలు చేశాడు. వాహనం రిజిస్ట్రేషన్ కోసం గురువారం కామారెడ్డికి వెళ్లి ఇస్సానగర్‌కు తిరిగివస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మోహన్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు, బాధిత కుటుంబసభ్యులు బాధ్యులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని రోడ్డుపై బైటాయించారు. ఎస్సై గణేశ్ వారిని సముదాయించి మోహన్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిజాంసాగర్‌కి చెందిన రాథోడ్ రమేశ్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ గురువారం తెలిపారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి.. నిజాంసాగర్‌కు చెందిన రాథోడ్ రమేశ్ పదేళ్ల క్రితం నగరంలోని రోటరీనగర్‌కి చెందిన భార్గవిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. రమేశ్‌ను కొన్ని రోజులుగా అతని భార్య భార్గవి, ఆమె అన్న బాలకృష్ణతోపాటు వారి తల్లిదండ్రులు మానసికంగా వేధిస్తున్నారు. ఇంట్లో ఇటీవల జరిగిన ఫంక్షన్‌లో రమేశ్‌ను బాలకృష్ణ కొట్టాడు. దీంతో మానసిక వేద నకు గురైన రమేశ్ గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొనఊపిరితో ఉన్న అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన తమ్ముడు రమేశ్ మృతికి కారణమైన భార్గవి, బాలకృష్ణతో పాటు వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలని రవి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై సీసాతో దాడి



ఆస్పత్రిలో బాధితుడు అనిల్

ఎడపల్లి (బోధన్): మండలంలోని జానకంపేట్‌లో హోటల్ వద్ద ఇద్దరి మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం సీసాతో దాడి వరకు వెళ్లింది. ఎస్సై వంశీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హోటల్ వద్ద అనిల్ అనే యువకుడు కూర్చుని ఉండగా, రమేశ్‌గౌడ్ అటువైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అనిల్ తనవైపు వేలెత్తి చూపాడని రమేశ్ వాగ్వాదానికి దిగాడు. ఇద్దరిని స్థానికులు సముదాయించగా, అక్కడి నుంచి వెళ్లిపోయిన రమేశ్‌గౌడ్ తిరిగి వచ్చి గొడవకు దిగి కల్లు సీసాతో అనిల్ తలపై కొట్టాడు. బాధితుడిని వెంటనే 108లో జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, రమేశ్‌గౌడ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

కాలువ కట్టను ఆక్రమించిన వ్యక్తి అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నిజాంసాగర్ కాలువ తెగిపోవడానికి కారణమైన వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. జర్నలిస్టుకాలనీ సమీపంలో కాలువకట్టను ఆక్రమించి ఓ వ్యక్తి పందుల కొట్టాన్ని ఏర్పాటు చేశాడు. కట్టను ఆక్రమించడం వల్లే కాలువ తెగిపోయిందని ఇరిగేషన్ అధికారులు అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడికి గాయాలు

ఇందల్వాయి: తిర్మన్‌పల్లి – రాంపూర్ రోడ్డులో చెట్టును ఢీకొని ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటనలో వెంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన మలావత్ భూపతికి తీవ్రగాయాలయ్యాయి. రాంపూర్‌లో ఇసుక లోడ్‌ను ఖాళీ చేసిన భూపతి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టిందని, ఈ ఘటనలో గాయాలపాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

ఇందల్వాయి: మండలంలోని స్టేషన్ తండా అటవీ ప్రాంతంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిందని, మృతుడిని జిల్లా కేంద్రంలోని జెండాగల్లీకి చెందిన బాలకృష్ణ(35)గా గుర్తించామని ఎస్సై మనోజ్ తెలిపారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు గురువారం అప్పగించామన్నారు.